


నేడు పీయూసీ ఫలితాలు

పావగడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గత నెల మార్చి 1నుంచి 23వ తేదీ వరకు జరిగిన ద్వితీయ పీయూసీ పరీక్షా ఫలితాలు మంగళవారం 1.30గంటలకు వెలువడనున్నట్లు బీఈఓ ఇంద్రాణమ్మ తెలిపారు. ప్రముఖ వెబ్‌సైట్లలో విద్యార్థులు ఫలితాలను చూసుకోవచ్చన్నారు. విద్యార్థులు ఫెయిలైనా ఎలాంటి ఆందోళనకు గురికాకుండా మరో పరీక్షకు సిద్ధం కావాలని ఆమె సూచించారు.



ఎగుమతికి.. ఎన్ని కష్టాలో..?





- ట్రంప్ ప్రతీకార సుంకం.. రాష్ట్రంపై తీవ్ర ప్రభావం
- కాఫీ, దినుసులు, మిర్చి ఎగుమతులపై భారం
- జీఎస్టీలో కోతతో రాష్ట్ర ఖజానాకు గండి ● వ్యాపారుల్లో అలజడి

బెంగళూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టాక ప్రపంచదేశాలపై ప్రతీకార పన్నుల అస్త్రం విధించారు. మనదేశంపైనా ట్రంప్ పన్నులప్రభావం భారీగా పడనుంది. ముఖ్యంగా రాష్ట్రం నుంచి అమెరికా దేశానికి ఎగుమతి అయ్యే కీలకమైన సాఫ్ట్‌వేర్, కాఫీతోపాటు పలు రంగాలపై కోలుకోలేని ప్రభావం పడనుంది. మనదేశంపై 26శాతం ప్రతీకార పన్నుల అస్త్రం ప్రయోగించడంతో కర్ణాటక వ్యాపార వ్యవహారాలపైనా ప్రభావం చూపనుంది. ప్రధానంగా జీఎస్టీ టార్గెట్‌లు భారీగా తగ్గే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ఆర్థికతపై దెబ్బ పడనుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆర్థిక లోటు, రుణాల ప్రమాణం పెంపు, నిరుద్యోగం, ప్రాంతీయ అసమానత అంశాలపై కోలుకోలేని ప్రభావం చూపనుంది. దేశంలో జీఎస్టీ వసూళ్లలో మహారాష్ట్ర తర్వాత కర్ణాటక రెండోస్థానంలో ఉంది. రానున్న రోజుల్లో వ్యాపార వ్యవ హారాలు తగ్గుముఖం పట్టడం ద్వారా రాష్ట్ర ఖజానాకు కోట్లాదిరూపాయలు లోటు ఏర్పడే అవకాశం ఉంది. ట్రంప్ ప్రతీకార పన్నుల విధింపు రాష్ట్ర ఖజానాపై తీవ్రమైన పరిణామం చూపనుందని ఆర్థిక నిపుణుల అభిప్రాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏకీభవిస్తోంది. కొన్ని స రుకుల ఎగుమతులు తగ్గుముఖం పట్టవచ్చునని, ఐటీ ఎగుమతులపై జీరో ట్యాక్స్ ఉన్నందున ఈ విభాగం ద్వారా వచ్చే పన్నుల ద్వారా ఆదాయం తగ్గదని ఆర్థికశాఖ కార్యదర్శి పీసీ జాఫర్ అభిప్రాయపడుతున్నారు. అమెరికా పన్నుల పాలసీ రాష్ట్ర ఆర్థికతపై ఎంతమేర దెబ్బపడనుందనేది స్పష్టంగా చెప్పలేకపోయినా జీఎస్టీ వసూళ్లపై దెబ్బ తప్పదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఔషధాలకు మినహాయింపు

దేశంనుంచి అమెరికాకు ఔషధాల ఎగుమతుల ప్రమాణం 14శాతంగా ఉంది. ప్రతీకార సుంకం నుంచి



మినహాయింపు ఉండడంతో ఈ రంగం మరింత బలోపేతం కానుందని కర్ణాటక వాణిజ్యపరిశ్రమల సంస్థ ఛైర్మన్ ఎంజీ బాలకృష్ణ అభిప్రాయపడుతున్నారు. దేశంలోని ఎగుమతుల శాతంలో కర్ణాటక 20.5 శాతంగా ఉంది. సరుకుల ఎగుమతులలో 6.09శాతం, సాఫ్ట్‌వేర్ రంగంలో 41శాతం రాష్ట్ర వాటాగా ఉంది.

కాఫీపై తీవ్ర ప్రభావం

రాష్ట్రంలో ప్రముఖ వాణిజ్యపంట కాఫీకి ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. గత ఏడాది డిసెంబరు నాటికి దేశం నుంచి 3.82 లక్షల టన్నుల కాఫీ ఎగుమతి అయ్యింది. ఇటలీ, రష్యా, బెల్జియం, టర్కీ, అమెరికాతోపాటు పలు దేశాలకు ఎగుమతి అయ్యింది. అమెరికాకు అరేబికా, రోబస్టా, రోస్టెడ్ కాఫీ విత్తనాలతో కలిపి 9,282 టన్నుల రవాణా అయ్యింది. గతంలో భారత్ కాఫీకి అమెరికాలో పన్ను మినహాయింపు ఉండేది. ప్రస్తుతం సుంకాల అస్త్రంతో కొంత ప్రభావం పడనుంది. దేశంనుంచి అత్యంత ఎక్కువగా యూరప్ దేశాలకు కాఫీ ఎగుమతి అవుతుంది. అమెరికాకు కాఫీ వెళ్లినా భారీగా నష్టం ఉండదని ఇండియన్ కాఫీబోర్డు ఛైర్మన్ ఎంజే దినేశ్ దేవబృంద అభిప్రాయపడ్డారు.





సాంబారు దినుసులపై..

రాష్ట్రంలో సాగు అయ్యే సాంబారు దినుసులకు అమెరికా మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. రాష్ట్రంనుంచి ప్రధానంగా మిరియాలు, ఎండుమిర్చి, పసుపు, అల్లం రవాణా అవుతుంది. చిక్కమగళూరు, కొడగు, హాసన్, ఉత్తరకన్నడ జిల్లా శిరసి ప్రాంతాలలో నాణ్యమైన మిరియాలు సాగు అవుతాయి. చామరాజనగర, మైసూరు, బాగల్కోటె, బెళగావి జిల్లాల్లో నాణ్యమైన పసుపు పండుతుంది. మలెనాడు ప్రాంతాలైన శివమొగ్గ, చిక్కమగళూరు, హాసన్, కొడగుతోపాటు పలు జిల్లాల్లో అల్లం సాగు చేస్తారు. ఇవి అన్నీ అమెరికాకు దశాబ్దాలకాలంగా ఎగుమతి అవుతున్నాయి. బళ్ళారి, ధారావాడ, హావేరి జిల్లాల్లో ఎండుమిరప ఉత్పత్తి ఎక్కువ. ఇవికూడా విదేశాలకు ఎగుమతి అవుతాయి. సాంబారు దినుసులకు ఇప్పటివరకు అమెరికా 5.29శాతం సుంకం విధించేది. ప్రస్తుత మార్పులతో ఎంతమేర అనేది స్పష్టం కాలేదు. ఇలా లక్షలాది ఎకరాలలో సాగు అయ్యే సాంబారు పంట దిగుబడులపైనా ట్రంప్ భస్మాసుర హస్తం పడనుంది.



ఆందోళనలో ఐటీ రంగం

ఐటీ రంగంపై ట్రంప్ ప్రతీకారసుంకాన్ని విధించకపోయినా ప్రభావం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దేశంలో ఐటీ మార్కెట్ విలువ రూ.21.31 లక్షల కోట్లు. కర్ణాటక సాఫ్ట్‌వేర్ కంపెనీలకు విదేశాల ప్రముఖ ఆదాయమే కీలకమైనది. వీటిలో అమెరికానుంచే ఎక్కువ ఆదాయం వస్తోంది. ఎలక్ట్రానిక్, సాఫ్ట్‌వేర్ ఎగుమతులలో రాష్ట్రం మూడింట ఒకభాగం కలిగి ఉంది. 2024-25 ఆర్థికసంవత్సరంలో ఐటీ కంపెనీల లాభాలు ఆశించినంత సంతృప్తిగా లేవు. ప్రస్తుత ఏడాది ఇదే పరిస్థితి కొనసాగితే ఐటీ కంపెనీలపై తీవ్రమైన ప్రభావం చూపనుంది. హెచ్-1బి వీసా నిబంధనలను మరింత కట్టుదిట్టం చేస్తామని ట్రంప్ ప్రకటించారు. తద్వారా వీసాలు ఉపయోగించుకుని అమెరికా కంపెనీలు విదేశీ ఉద్యోగులను నియమించు కునేందుకు అడ్డుకానుంది. ఇలా ఐటీ కంపెనీల ఆదాయం కూడా తగ్గనుంది. ఆటోరంగంపై ప్రభావం చూపకపోయినా ఔషధాలు, జౌళిపై ప్రభావం చూపనుంది. కర్ణాటక నుంచి పాలిష్ చేసిన గ్రానైట్, స్లాబ్‌లను అమెరికాకు ఎగుమతి చేస్తారు.

రాష్ట్రం నుంచి ఎగుమతులు	
ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్	6.25 లక్షల కోట్లు
ఇంజనీరింగ్ సరుకులు	47,648 కోట్లు
పెట్రోలియం ఉత్పత్తులు	25,876 కోట్లు
ఔషధ సౌందర్య ఉత్పత్తులు	11,447 కోట్లు
రెడీమేడ్ దుస్తులు	9,951 కోట్లు
విత్తనాలు డ్రింక్స్	3,567 కోట్లు
కాఫీ	5,261 కోట్లు
సముద్ర ఉత్పత్తులు	667 కోట్లు
సాంబారు దినుసులు	602 కోట్లు

పౌర కార్మికులకు మేడే కానుక..!

- 1 నుంచి వారి సేవలు రెగ్యులర్: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య




పౌర కార్మిక సంఘం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేన పౌరకార్మికుల సేవలను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. ప్యాలెస్ మైదానంలో పౌరకార్మిక మహాసంఘం 25వ వార్షికోత్సవం, పౌరకార్మికుల చైతన్య కార్యక్రమాన్ని సోమవారం సీఎం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అయినా పౌరకార్మికుడైనా తేడా లేదని అందరి సేవలు పవిత్రమేనన్నారు. బసవణ్ణ వచనాలలోనే కాయకవే కైలాస అన్నారన్నారు. పౌర కార్మికులతోపాటు డ్రైవర్లను రెగ్యులరైజ్ చేస్తామన్నారు. మీరు కార్మికులుగా పనిచేశారని, మీ పిల్లలను విద్యావంతులు చేసి ఆత్మాభిమానంతో జీవించేలా ప్రోత్సహించాలన్నారు. అవకాశం లభిస్తే ప్రతి ఒక్కరి ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. పౌరకార్మికులకు నగదు రహిత ఆరోగ్యకార్డు ఇస్తామన్నారు. పౌరకార్మికుల పోరాటంలో నారాయణ పాత్ర కీలకమని కొనియాడారు. సంఘం ద్వారా వచ్చిన డిమాండ్లను తమ ప్రభుత్వం దాదాపు పరిష్కరించిందన్నారు. మైసూరులో 524 ఇళ్లు నిర్మించామన్నారు. పౌరకార్మికుల వేతనాలు రూ.7వేల నుంచి రూ.17వేలకు పెంచామన్నారు. ఏటా వెయ్యిమంది పౌరకార్మికులకు విదేశీ ప్రయాణం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ పౌరకార్మికులకు, కాంగ్రెస్ పార్టీకి ఓ ప్రత్యేక సంబంధం ఉందని కొనియాడారు. పౌర కార్మికుల రక్షణకు కట్టుబడ్డామన్నారు. మంత్రి మునియప్ప, మాజీ మంత్రి ఆంజనేయ, పౌరకార్మికసంఘం నాయకులు, వివిధ జిల్లాలనుంచి పెద్దసంఖ్యలో పౌరకార్మికులు పాల్గొన్నారు.

అందరూ అహ్మదాబాద్‌కే..!

- ఏఐసీసీ సదస్సుకు తరలిన కాంగ్రెస్ నేతలు
- సీఎం, డీసీఎం సహా 150మందికిపైగా..

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగే ఏఐసీసీ జాతీయ సమ్మేళనానికి కాంగ్రెస్ నేతలు తరలివెళ్లారు. అహ్మదాబాద్‌లో 64ఏళ్ల తర్వాత సభ జరుగుతోంది. మంగళవారం ప్రారంభమయ్యే సదస్సు బుధవారంతో ముగియనుంది. సదస్సులో పాల్గొనేందుకు సీఎం సిద్దరామయ్య సోమవారం మధ్యాహ్నం బయల్దేరారు. రాత్రి అహ్మదాబాద్‌లో బస చేయనున్నారు. ఇక డీసీఎం డీకే శివకుమార్ రాత్రి దాకా కార్యక్రమాలు ఉండడంతో ఆ తర్వాత బయల్దేరనున్నారు. రాష్ట్రం నుంచి 150మందికి పైగా ప్రతినిధులు బయల్దేరారు. దాదాపు మంత్రులందరితోపాటు పార్టీ రాష్ట్ర పదాధికారులు, జాతీయ కమిటీలోని ము ఖ్యులు వెళ్లనున్నారు. కాంగ్రెస్ సభలో రాష్ట్రానికి సంబంధించిన అంశాలు ప్రస్తావనకు రానున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర సహకారశాఖ మంత్రి రాజణ్ణ వెళ్లనున్నారు. ఆయన సహనీట్రాప్‌కు గురైన విషయాన్ని కీలకనేతలతో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మంగళవారం డీసీఎం తోపాటు పలువురు తరలివెళ్లనున్నట్లు తెలిపారు. కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం అహ్మద్ మాట్లాడుతూ భవిష్యత్తు ఎన్నికలను కాంగ్రెస్ ఏ విధంగా ఎదుర్కొనాలని, పార్టీ బలోపేతానికి కీలకమైన నిర్ణయాలుంటాయన్నారు.



ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ పోరు



మైసూరులో ర్యాలీగా వెళ్తున్న బీజేపీ నాయకులు

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా విఫలం చెందిందని, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి మండిపడ్డారు. మైసూరులో సోమవారం జనాక్రోశ ర్యాలీని ప్రారంభించారు. నిత్యావసర ధరలు పెరిగాయని, మరోవైపు మతానికి అనుగుణంగా ప్రభుత్వ కాంట్రాక్టులలో 4శాతం రిజర్వేషన్లను ముస్లింలకు కేటాయించడం సరికాదన్నారు. రాష్ట్రప్రభుత్వం తప్పిదాలను కప్పి పుచ్చుకునేందుకు రోజుకో విధంగా వ్యవహరిస్తోందన్నారు. డీజిల్‌పై రాత్రికి రాత్రి చార్జీలు పెంచారని మండిపడ్డారు. తొలుత చాముండేశ్వరి ఆలయంలో పూజలు జరిపి అనంతరం మైసూరు నగరవీధుల్లో ర్యాలీ జరిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి, మాజీ మంత్రులు అశ్వత్థనారాయణ, సీటీ రవి, శ్రీరాములు, వేలాదిమంది కార్యకర్తలు పాల్గొన్నారు. కేంద్రమాజీ మంత్రి సదానందగౌడ, ఎంపీ పీసీ మోహన్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. డమ్ము వాయించి కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ర్యాలీ ప్రారంభించగా నగరవ్యాప్తంగా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు హోరెత్తాయి. కాగా సీఎం సిద్దరామయ్య బీజేపీ ర్యాలీని ఉద్దేశించి మీడియాతో మాట్లాడుతూ కేవలం పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర ఉనికి కోసమే యాత్రలు చేస్తున్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పెట్రోల్, డీజిల్‌తోపాటు వంటగ్యాస్ ధర పెంచారని, జనాక్రోశ యాత్ర జరిపే బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై కేంద్రం వద్ద నిలదీసే సత్తా ఎవరికీ లేదన్నారు. విజయేంద్రది పేమెంట్ సీట్ అని సొంతపార్టీ వారే ఆరోపిస్తున్నారన్నారు. అతడికి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



అలంకరణలో గాలి ఆంజనేయస్వామి



ముగళూరు పురవీధుల్లో రథోత్సవం

వైభవంగా గాలి ఆంజనేయస్వామి రథోత్సవం

బెంగళూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో ఒకటైన మైసూరు రోడ్డులోని గాలి ఆంజనేయ స్వామి ఆలయ ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా ఆదివారం బ్రహ్మరథోత్సవం నిర్వహించారు. సోమవారం చిన్నరథంపై సీతారామ లక్ష్మణ హనుమంత సమేతంగా ఊరేగించారు. సుమారు కిలోమీటరు మేర ఊరేగింపు జరిగింది. రథోత్సవం నేపథ్యంలో ట్రాఫిక్‌ను కొద్దిసేపు మళ్లించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుబందోబస్తు నిర్వహించారు.

ముగళూరులో...

దొమ్మసంద్ర: ఆనేకల్ తాలూకా ముగళూరు గ్రామపంచాయతీ పరిధిలోని దొడ్డతిమ్మసంద్రలో తిరుమల వీరాంజనేయస్వామి రథోత్సవం, జ్యేష్టాదేవి సమేత శనిమహాత్మస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా సీతారామ కల్యాణోత్సవం, వీరాంజనేయస్వామి గరుడవాహన ఉత్సవం, జ్యేష్టాదేవి శనిమహాత్మా కల్యాణోత్సవం వంటి కార్యక్రమాలు శుక్ర, శనివారాలలో సాగాయి. ఆదివారం రెండు రథాలపై ఊరేగింపు సాగింది. వీరగాసె, డొళ్లుకుణిత, తమటె, గారడీబొమ్మలు, యక్షగానం, వివిధ జానపద కళా బృందాల ప్రదర్శనలు రథోత్సవానికి మరింత శోభతెచ్చాయి. బెంగళూరు నగర జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షుడు మునిరాజు మాట్లాడుతూ ఐదురోజుల జాతరలో భాగంగా సోమవారం రాత్రి మారమ్మ దేవి పూల కరగ ఉంటుందన్నారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో పల్లకీలు ఉత్సవంలో పాల్గొంటాయన్నారు. రథోత్సవంలో గ్రామపంచాయతీ సభ్యులు అశోక్, వెంకటేశ్, ప్రధాన అర్చకులు వెంకటేశ్, ముఖ్యులు ఎస్ నాగరాజు, మంజునాథ్, గురుమూర్తి, అంబరీశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతర వేళ విషాదం
- కాలువలో కొట్టుకుపోయిన చిన్నారులు
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

6

పర్యాటకురాలితో అసభ్య ప్రవర్తన
- స్థానికుల దాడిలో కేరళవాసి దుర్మరణం
- బృందావన్ గార్డెన్స్‌లో ఘటన

6

ఉపలోకాయుక్త తనిఖీ
- దొడ్డబళ్లాపుర ఏపీఎంసీలో సౌకర్యాలు లోపించాయని అధికారులపై ఆగ్రహం

7

కోచిముల్ అక్రమాలపై లేఖ
- ఇన్‌చార్జ్ మంత్రి బైరతి సురేశ్‌కు బంగారపేట ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి లేఖాస్త్రం

7



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.86	1,579.44
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	4,279	932
నీటి నిల్వ (టీఎంసీలు)	7.23	4.20

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తరాదు

● నీరు కలుషితం కాకుండా చూడాలి ● పశుగ్రాసం కొరత లేకుండా చూడాలి : అధికారులకు కలెక్టర్ ఆదేశం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా వివిధ తాలూకాలు , గ్రామాల్లో తాగునీటి సరఫరా స్థిరంగా ఉండాలని, నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలని జిల్లా విపత్తు అథారిటీ ఛైర్మన్ జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కేశ్వన్ వీడియో ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వేసవిలో జిల్లాలో పశువులకు తాగునీరు, మేత కొరత లేకుండా చేసుకోవాలని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తితే నీటి ట్యాంకర్లను అందుబాటులోఉంచుకోవాలన్నారు. పశుగ్రాసం తగినంత నిల్వ ఉంచాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సమస్యలను ఎదుర్కొనే గ్రామాలను గుర్తించి ఆయా తాలూకా తహశీల్దార్, తాలూకా పంచాయతీలకు ఆ గ్రామాల గురించి సమాచారం అందించారు. స్థానిక సంస్థల పరిదిలోని మున్సిపల్ కౌన్సిల్, మున్సిపల్ కార్పోరేషన్, మున్సిపల్ కార్పోరేషన్ చీఫ్ ఆఫీసర్లును కార్యనిర్వాహక అధికారులు సందర్శించాలని ఆయన ఆదేశించారు. గ్రామీణ ప్రాంతంలోని ఆర్‌ఓ యూనిట్లను శుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీరు ఎక్కడా కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బళ్ళారి తాలూకాలోని హలకుంది ,హొన్నళ్ళి, హొన్నల్లి తండా గ్రామాల తాగునీటి అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.పెరిగిన సూర్యకాంతి కారణంగా ప్రభుత్వ కార్యాలయాల పనివేళలు మరాయి. కాబట్టి అధికారులు అవసరమైనప్పుడు అవసరమైన సమయానికి మించి కూడా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అధికారులు ఉదాశీనంగా వ్యవహరించ రాదన్నారు. జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి మహ్మద్ హారీస్ సుమైర్ మాట్లాడుతూ.. ఆయా గ్రామ పంచాయతీ స్థాయిలో ఓవర్ హెడ్ తాగునీటి ట్యాంకులను నింపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఈ విషయంలో అధికారులు ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకుని సమన్వయంతో పని చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్ జుబేర్, అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్, గ్రామీణ తాగు నీరు, పారిశుద్ధ్య విభాగం ఇంజనీర్ ఇందుధర్, బళ్లారి గ్రామీణ జేఈ జెస్కాం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంగనాథబాబు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ కుమార్



నీటి డ్రమ్ములను పరిశీలిస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు

జ్వరాన్ని నిర్లక్ష్యం చేయకండి

● దోమలను అరికడితేనే డెంగీకి చెక్ : వైద్యాధికారుల సూచన

బళ్లారి సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఒక్క రోజు జ్వరం వచ్చినా నిర్లక్ష్యం చేయరాదని, డెంగీ తదితర వ్యాధులు ప్రబలుతున్నందున సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అంటు వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా సూచించారు. సోమవారం ఆయన నగరంలోని జాగృతి నగర్‌లో వైద్య బృందంతో ఇంటింటి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అంతటా ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలచిందని, ఈడీస్ దోమ ద్వారా డెంగీ ప్రబలే ప్రమాదం ఉందన్నారు. డెంగీకి సత్వర చికిత్స అందిస్తే నివారించవచ్చన్నారు. నీరు నిలిచిపోకుండా చూసుకోవడంతో పాటు నీటిని నింపే పరికరాలను వారానికి ఒకసారి శుభ్రం చేయాలన్నారు. నీటి పాత్రలలో కొబ్బరినూనె వేయడం ద్వారా దోమల వృద్ధిని నివారించవచ్చని వివరించారు. ఈసందర్భంగా జిల్లా ఆరోగ్య వైద్యాధికారి ఈశ్వర్‌దాసప్పనవర్, క్షేత్ర విద్య అధికారి శాంతమ్మ, ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణ అధికారి దానకుమారి, ఆశా కార్యకర్త భువనేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త రత్న, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జాతర వేళ విషాదం

● కాలువలో కొట్టుకుపోయిన చిన్నారులు
● కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు



గాణదాళ వద్ద కాలువ

రాయచూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సంబరంగా గడపాలని జాతరకు వచ్చిన ఆ రెండు కుటుంబాల్లో విషాదం మిగిలింది. ఇడపనూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాయచూరు తాలూకాలోని గాణదాళ పంచముఖి ఆంజనేయ స్వామి జాతరకు ఆ రెండు కుటుంబాలు పిల్లలతో సహా వచ్చారు. కుటుంబ సభ్యులందరూ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న సమయంలో ఆ బాలిక, బాలుడిద్దరూ సమీపంలోని కాలువ వద్దకు వెళ్లి స్నానం చేసే ప్రయత్నం చేశారు. నీటి ఉధృతి కారణంగా వాళ్లు కొట్టుకుపోయారు. బాలికను తెలంగాణ రాష్ట్రం గద్వాల ప్రాంతానికి చెందిన అంజలి(17)గా, బాలుడిని ఏపీ రాష్ట్రం ఎమ్మిగనూరుకు చెందిన రఘు(14)గా గుర్తించారు. తల్లిదండ్రులు చూస్తుండగానే వీరిద్దరూ నీళ్లల్లో మునిగి కొట్టుకుపోయారు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ఎవరూ కాపాడే ప్రయత్నం చేయలేకపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గల్లంతైన వారి కోసం గాలింపు చేపట్టారు. సంఘటన సంబంధించి ఇడపనూరు పోలీసులు కేసు నమోదు చేశారు.



అంజలి, రఘు (ఫైల్)

పర్యాటకురాలితో అసభ్య ప్రవర్తన

బెంగళూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కావేరి నది వద్ద కృష్ణరాజ సాగర్ ప్రాజెక్టు బృందావన్ గార్డెన్స్‌లో సందర్శకుల దాడిలో కేరళకు చెందిన జార్జ్ జోసెఫ్ (45) అనే వ్యక్తి మృతిచెందారు. ఇక్కడ శనివారం నిర్వహించిన మ్యూజికల్స్ ప్రోగ్రామ్‌కు వచ్చిన ఓ పర్యాటకురాలిపట్ల జోసెఫ్ అసభ్యంగా ప్రవర్తించారు. గమనించిన సందర్శకులు.. అతన్ని చితకబాదారు. దీంతో జార్జ్ జోసెఫ్ కుప్పకూలిపోయారు. గార్డెన్స్ సిబ్బంది అంబులెన్స్‌లో అతన్ని ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక జార్జ్‌జోసెఫ్ మృతి చెందారు. కేఆర్ఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల వేళ మాత్రమే కాదు..

● ప్రజాసమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటా : 'సలాం బళ్లారి'లో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటు అడిగేందుకు ఇంటింటికి ఎలా వచ్చానో, ప్రజాసమస్యలు తీర్చడానికి కూడా అలానే వస్తానని ఎమ్మెల్యే నారా భరత్ అన్నారు. సోమవారం ఆయన నగరంలోని పలు వార్డుల్లో పర్యటించి స్థానిక సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా నారా మాట్లాడుతూ సువర్ణ బళ్లారి చేయడమే తన ఉద్దేశమని, నగర సమస్యలపై ఉపేక్షించేది లేదన్నారు. సలాం బళ్లారి అభియాన్ కార్యక్రమాపికప ఆయన పదవ వార్డులో నిర్వహించారు. ప్రతి వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించేలా చూస్తానన్నారు. మాజీ మంత్రి నాగేంద్రను మళ్లీ కేబినెట్‌లోకి తీసుకోవాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న జమీర్ అహ్మద్ కూడా నాగేంద్రకు ఉప మంత్రి కావాలని అభ్యర్థించారు. మంత్రి జమీర్ అహ్మద్, నాగేంద్ర కనిపించడం లేదన్న ప్రతిపక్షాల విమర్శలను ఆయన తిప్పికొట్టారు. స్థానిక గాడిగి చన్నప్ప సర్కిల్‌లో భారీ టవర్ నిర్మాణం పూర్తయిందని, దానిని నాగేంద్ర చేతుల మీదుగా ప్రారంభిస్తారని ఎమ్మెల్యే అన్నారు. ఇన్‌చార్జి మంత్రి జిల్లాకు రాకున్నా ఎక్కడా అభివృద్ధి కుంటుపడలేదన్నారు. బళ్లారి జిల్లాకు మంచి గ్రాంట్లు వస్తున్నాయని నిరంతరం అభివృద్ధి చెందుతోందన్నారు. సలాం బళ్లారి ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, ఇప్పటికే వార్డు నెంబర్ 06, 13లో పర్యటించిన సమస్యల ఆధారంగా రూ. కోటి అంచనాతో మౌలిక వసతులు కల్పించేందుకు కార్యాచరణ రూపొందించారు. రూ.3.50 కోట్లు అని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజన్న, బసవరాజు, మడివాళప్ప, తిమ్మప్ప, పృథ్వీరాజా, హరీష్, ఎండీ తౌసిఫ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హుస్సేన్ పీరా, వెంకటేష్ హెగ్డే, రాకేష్ వర్మ, ఛానాల్ శేఖర్, రసూల్, రాము, రజాక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న మైనార్టీ నాయకులు



వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

సిరుగుప్ప, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప పార్టీ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా సోమలింగప్ప మాట్లాడుతూ బీజేపీ చారిత్రాత్మక పాలనతో దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తోందన్నారు. బీజేపీ యువనాయకుడు దరప్ప నాయక మాట్లాడుతూ దేశప్రధాని నరేంద్ర మోదీ దేశ భవిష్యత్తు కోసం ఉత్తమ సేవలు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షుడు మల్లికార్జునస్వామి, ప్రధాన కార్యదర్శి బెళగల్ బసవరాజు, బండ్రాళ్ల మల్లికార్జున, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ డిప్యూటీ సెక్రటరీ గిరిజాశంకర్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కురుగోడుతాలూకాలోని బాదనహట్టి గ్రామంలో నరేగా ప్రాజెక్టు కింద చేపట్టిన పనులను జిల్లా పంచాయతీ డిప్యూటీ కార్యదర్శి గిరిజా శంకర్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కుటుంబానికి 100రోజుల నిరంతర పని కల్పిస్తున్నామన్నారు. నరేగా పథకం కింద దివ్యాంగులు కూడా శారీరక శ్రమలో పాల్గొనవచ్చన్నారు. కనీసం 60శాతం మంది మహిళలకు తప్పనిసరి వేతన పనులు కల్పిస్తామని వారు నరేగా యాప్ ద్వారా రెండుసార్లు తమహాజరును నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కొలతల ప్రకారం పని చేయకపోతే వేతనాల్లో కోత తప్పదన్నారు. ఎండలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా 60 ఏళ్ళు పైబడిన వారు పనిలో పాల్గొనరాదన్నారు. నరేగావేతనం కింద వేతనం రూ.370 ఇస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా కురుగోడు టీపీపీ కార్యనిర్వహణాధికారి నిర్మల, సహాయక సంచాలకులు శివరామరెడ్డి, బాదనహట్టి గ్రామపంచాయితీ అభివృద్ధి అధికారి మల్లికార్జున, తాలూకా సిబ్బంది, తాలూకా పంచాయితీ గ్రామపంచాయితీ సిబ్బంది కార్మికులున్నారు.

జల సంరక్షణపై జాగృతి కార్యక్రమం



బయలు నాటక ప్రదర్శనలో కళాకారులు

తోరణగల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా తాళూరు గ్రామంలో సోమవారం జలసంరక్షణపై బయలు నాటకం ద్వారా జాగృతి నిర్వహించారు. జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ గ్రామ పంచాయతీ ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో అధికారి మంజునాథ్ రాసిన కథ ఆధారంగా గ్రామీణులకు అవగాహన కల్పించారు. పరిసరాలు నాశనం చేయకుండా నీటిని సంరక్షించడం, నీటిని వృథా చేయకుండా నీటిని సంరక్షించడం ద్వారా మొదలగు విషయాల ద్వారా నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు బసవరాజు, ప్రవీణ్ కుమార్, వీరేంద్ర, హేమంతరాజు, కుమారస్వామి, తదితరులు శ్రీకృష్ణుడు, అర్జునుడు, భీముడు, నకుల, సహ దేవులు, శకుని పాత్రలు వేశారు. నాటకం రక్తికట్టింది. ఈ సందర్భంగా జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ మంజునాథ, నాగన్న గౌడ్, ముఖ్య గురువులు బసవరాజు, శిక్షణ ఇలాఖే సభ్యులు పాఠశాల ఎస్‌డీఎంసీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.



హోసూరు వద్ద నేలకొరిగిన అరటి పంట

నేలకొరిగిన అరటి పంట

కంప్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లో అరటితోటలు నేలకొరిగాయి. అకాల వర్షాలతో పంటలు దెబ్బ తింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంటలు గాలివానకు దెబ్బతింటున్నాయని అన్నదాత ఆవేదన చెందుతున్నారు. విజయనగరం జిల్లా తంబరపల్లి, హంపి సాగర, మాళవి కురిసిన వర్షానికి వాగులు కూడా ఉప్పొంది ప్రవహించాయి. అలాగే హంపిలోని విజయవిఠల దేవస్థానం, రాతి రథం వద్ద కురిసిన వర్షానికి నీటి నిల్వ వుండటంతో చిన్నారులు నీటిలో ప్రతిబింబాలు చూస్తూ గంతులు వేస్తూ సంతోషాన్ని వ్యక్తపరచుకున్నారు. ఉభయ జిల్లాలో గాలివానలతో రైతుల్లో ఆందోళన మొదలయ్యింది.



ఉప్పొంగి పారుతున్న హంపి సాగర వాగు

హోసూరు జోన్



పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

సందడిగా పాఠశాల వార్షికోత్సవం

హోసూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): డెంకణీకోటలోని గురుకులం గ్లోబల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో వార్షిక సాంస్కృతిక ఉత్సవం సందడిగా సాగింది. వందేభారత్ ఇతివృత్తంతో కార్యక్రమాలు సాగాయి. ముఖ్యఅతిథిగా మోటివేషనల్ స్పీకర్‌గా పేరొందిన పారిశ్రామికవేత్త సురేశ్ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. సీనియర్ న్యాయవాది వీరభద్రయ్య, డీఎస్పీ ఆనంద్‌రాజ్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం వేదికగా ఉందని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. గురుకులం వ్యవస్థాపకుడు, ఛైర్మన్ డాక్టర్ గణపతిరెడ్డి, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

హోసూరు (సిప్‌కాట్), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శూలగిరి యూనియన్‌లోని అంజలం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం సంబరంగా సాగింది. ప్రధానోపాధ్యాయుడు తిలక్ అధ్యక్షత వహించారు. శూలగిరి జిల్లా విద్యాశాఖ అధికారి జార్జ్ మాదేశ్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థుల నృత్యం, నాటకం, తిరుక్కురల్ ప్రదర్శనలు సభికులను అలరించాయి. వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. టీచర్లు శంకరన్ కుమార్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, పాఠశాల నిర్వహణ కమిటీ ఛైర్‌పర్సన్ నేత్ర పాల్గొన్నారు.




అవార్డు అందుకుంటున్న కళాశాల అధ్యాపకులు

వ్యవసాయ కళాశాలకు అవార్డు

హోసూరు (కృష్ణగిరి), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చెన్నై వెటర్నరీ కళాశాలలో జరిగిన పదో జాతీయ వ్యవసాయశాస్త్ర తమిళ పరిశోధన సమావేశంలో కృష్ణగిరి జిల్లా సూలగిరి తాలూకా అత్తిముగంలోని ఆదియమాన్ వ్యవసాయ కళాశాలకు ఉత్తమ అవార్డు లభించింది. తమిళనాడు యూనివర్సిటీ ఆఫ్ వెటర్నరీ సైన్సెస్ వైస్‌చాన్సలర్ డాక్టర్ సెల్వకుమార్, తమిళనాడు డాక్టర్ జయలలిత ఫిషరీస్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఫిలిక్స్, తమిళనాడు వ్యవసాయ యూనివర్సిటీ వీసీ డాక్టర్ రామస్వామి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. డాక్టర్ సెల్వకుమార్ ఉత్తమ కళాశాల అవార్డును ప్రదానం చేశారు. ఆదియమాన్ వ్యవసాయ కళాశాలకు చెందిన ప్రొఫెసర్‌లు పాల్గొన్నారు.

చెరువును కాపాడాలని స్థానికుల వినతి

హోసూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): హోసూరులోని అనుమే స్కూల్ ప్రాంతంలోని సరస్సును రక్షించాలని స్థానికులు కోరుతున్నారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించాలని, కాలుష్యం బారినుంచి కాపాడాలని కోరుతున్నారు. చెరువు చుట్టుపక్కల పదుల సంఖ్యలో ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఫ్యాక్టరీల నుంచి వెలువడే వ్యర్థాలు చెరువులు కలుస్తున్నాయి. దీని ప్రభావం భూగర్భజలం కూడా కలుషితమై బోరుబావులలోని నీరు కూడా రంగు మారుతోంది. నగరానికి ప్రధాన నీటి వనరులలో ఒకటైన చెరువు కలుషితం కావడంపై పలువురు సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కలుషితమైన చెరువు

వైభవంగా జోడు మహారథోత్సవాలు



రథోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

బళ్లారి రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా మరమనహళ్లి పట్టణంలో శ్రీరామనవమి సందర్భంగా పూజ దేవతలు లక్ష్మీనారాయణ స్వామి, అంజనేయస్వామి జోడు రథోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం సాయంత్రం మరమనహళ్లి పట్టణంలో జరిగిన ఈ రథోత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. రథోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సలీం, డీఎస్పీ మల్లేశప్ప దొడ్డమనే హగరి బొమ్మనహళ్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వికాస్, ఎస్ఐలు మౌనేష్ రాథోడ్, బిబి మరియం 200 మంది చొప్పున పోలీసులు, హోంగార్డులతో భద్రతా చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

వైద్యవిద్యలో ప్రథమ స్థానం

సిరుగుప్ప, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా మెడికల్ కళాశాలలో వైద్యవిద్య అభ్యసిస్తున్న పట్టణానికి చెందిన మహ్మద్ జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో ఉత్తీర్ణత చెందారు. పట్టణంలోని 5వ వార్డుకు చెందిన మహమ్మద్ రఫీ కుమారుడు ఉత్తీరణతపై పలువురు అభినందించారు. బళ్లారి విమ్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అక్షయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆయన ధ్రువీకరణ పత్రాలను అందుకున్నారు.



ఖాజీ మహమ్మద్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

బంకించంద్ర ఛటర్జీ (వర్ధంతి)



జాతీయగీతం 'వందే మాతరం' పాటను సంస్కృతంలో ఆయనే రచించి భరతమాత కీర్తిని రెపరెపలాడేలా చేసిన బంకించంద్ర ఛటర్జీ (ఛటోపాధ్యాయ) 1838 జూన్ 27న పశ్చిమబెంగాల్ రాష్ట్రం నైహతిలో జన్మించారు. నవలా రచయిత, కవి, పాత్రికేయుడు. బెంగాల్ సాహిత్యాభివృద్ధికి పాటుపడిన వ్యక్తిగా సుపరిచితులు. తన రచనలతో స్వాతంత్రోద్యమకారులలో స్ఫూర్తి కలిగించారు. 14 నవలలు రాశారు. బెంగాల్ సాహిత్యంలో 'సాహిత్య సామ్రాట్'గా పేరొందారు. 'రాయ్ బహద్దూర్' బిరుదు పొందారు. 1894 ఏప్రిల్ 8న కన్నుమూశారు.

పండిట్ కుమార గంధర్వ (జయంతి)



హిందూస్తానీ గాయకుడు 'పద్మ విభూషణ్' గ్రహీత కుమార గంధర్వ 1924 ఏప్రిల్ 8న బెళగావి జిల్లా సుళేభావిలో జన్మించారు. అసలు పేరు శివపుత్ర సిద్ధరామయ్య కొంకళిమఠ్. ఐదో యేటనే దావణగెరెలో తొలి కచేరీ ప్రదర్శించిన ఘనత. ఆరో ఏట గుల్బర్గా జిల్లా గురుకల్మఠకు చెందిన శాంతవీర మహాస్వామిజీ ఇతను 'కుమార గంధర్వ' అంటూ అభివర్ణించగా అదే పేరుతోనే కొనసాగారు. నిర్గుణి భజనలు, జానపదాలు పాడడంలో ప్రత్యేకత సాధించారు. పాతరాగాలకు వన్నె తేవడంతో కొత్త రాగాలు సృష్టించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన జానపదాలకు గుర్తింపు తెచ్చారు. 'పద్మభూషణ్', కాళిదాస సమ్మాన్, కేంద్ర సంగీత నాటక అకాడమీ తదితర పురస్కారాలు అందుకున్నారు. 1992 జనవరి 12న తుదిశ్వాస వీడారు.

కోఫీ అన్నన్ (జయంతి)



ఐక్యరాజ్యసమితి మాజీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన కోఫీ అట్టా అన్నన్ 1938 ఏప్రిల్ 8న ఘనా దేశంలోని కుమాసిలో జన్మించారు. యూఎన్‌ఓకు ఏడో ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఆఫ్రికా ఖండం నుంచి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తొలి నల్లజాతీయుడు. రెండుసార్లు ఎన్నికై 1997 జనవరి 1 నుంచి పదేళ్లపాటు ఆ పదవిలో కొనసాగారు. ఐక్యరాజ్యసమితిలో పలు సంస్కరణలు తెచ్చారు. 2001లో నోబెల్ శాంతి పురస్కారం అందుకున్నారు. ఇందిరాగాంధీ శాంతి బహుమతి, బ్రిటీష్ రాణి నుంచి నైట్‌హుడ్ బిరుదు అందుకున్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణకు కృషి చేశారు. నెల్సన్ మండేలా స్థాపించిన ఎల్డెర్స్ సంస్థకు చైర్మన్‌గా వ్యవహరించారు. 2018 ఆగస్టు 18న కన్నుమూశారు.

అల్లు అర్జున్ (పుట్టినరోజు)



అల్లు అర్జున్ 1983 ఏప్రిల్ 8న మద్రాస్‌లో జన్మించారు. అలనాటి నటుడు అల్లు రామలింగయ్య మనుమడు, మెగాస్టార్ చిరంజీవి మేనల్లుడు. తన అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో నటుడిగా రాణించారు. 2020 విడుదలైన 'అల వైకుంఠపురములో..' అత్యధిక కలెక్షన్ సినిమాలలో ఒకటిగా నిలిచింది. 6 ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్, 3 నంది అవార్డులు అందుకున్నారు. 2021లో విడుదలైన 'పుష్ప' సినిమా ఒక క్రేజ్‌గా నిలిచింది. ప్రొ కబడ్డీ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గాను, పలు రకాల ఉత్పత్తులు, సంస్థలకు రాయబారిగా వ్యవహరిస్తున్నారు.

నిత్యామీనన్ (పుట్టినరోజు)



నిత్యమీనన్ 1990 ఏప్రిల్ 8న బెంగళూరులో జన్మించారు. మళయాళీ కుటుంబానికి చెందిన ఆమె నటిగా, గాయనిగా రాణించారు. మళయాళం, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 50కు పైగా సినిమాలలో నటించారు. తెలుగులో మూడు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, రెండు నంది అవార్డులు అందుకున్నారు. ఉత్తమనటిగా పలుమార్లు నామినేట్ అయి స్పెషల్‌జ్యూరీ, ఇతర అవార్డులు పొందారు.

కొనసాగిన వేమన ఉత్సవాలు



విద్యుద్దీపాలతో అలంకరించిన చాందినీ బండి

గాండ్లపెంట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లిలో శ్రీయోగి వేమన ఉత్సవాలను భాగంగా రెండో రోజైన సోమవారం ఘనంగా నిర్వహించారు. రాత్రి చాందినీ బండ్ల మెరవన నిర్వహించారు. మొక్కులు తీర్చుకోవడానికి రంగురంగుల విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన చాందినీ బండ్లను ఏర్పాటు చేశారు. బాణసంచా పేల్చుతూ ఈబండ్ల ముందు వి విధ రకాల సంస్కృతిక కా ర్యక్రమాలు నిర్వహించా రు. యోగి వేమన జీవ సమాధిని ఎమ్మెల్యే కంది కుంట వెంకటప్రసాద్ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమం రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జాము వరకు నిర్వహించి.. వేమన ఆలయానికి చేరుకుంటారు. భక్తులు బండల్లో పానకం పంచుతూ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణంలో సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముడి శోభాయాత్ర

మహదేవపుర, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక శోభాయాత్ర నిర్వహించారు. ద్వారకా గురుపీఠం గురువు జగద్గురు సూర్యాచార్య కృష్ణదేవానంద గిరీజీ మహరాజ్ సాన్నిధ్యం వహించారు. బెమెల్ సర్కిల్‌లో ప్రారంభమైన శోభాయాత్ర వేలాదిమంది భక్తులు, బీజేపీ కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. హెచ్ఏఎల్ మెయిన్‌రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్డు మీదుగా దొడ్డనక్కుంది కోదండరామస్వామి దేవస్థానానికి ర్యాలీ చేరుకుంది. సుమంగళిలు కళశాలతో యాత్రలో పాల్గొన్నారు. సనాతన ధర్మం కోసం మాజీ మంత్రి అరవింద లింబావళి, ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళిల ఆధ్వర్యంలో శోభాయాత్ర ఏర్పాటు చేయడంపై స్వామిజీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు పుణ్యస్నానానికి వచ్చినవేళ తనను ఆహ్వానించారన్నారు. ఉత్సవంలో సీవీ రామన్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే రఘు, మహదేవపుర నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు హాడి పిళ్ళప్ప, శ్రీధర్‌రెడ్డి, ప్రముఖులు ఎల్ రాజేశ్, సురేశ్, మహేంద్రమోది, శ్రీధర్, లోకేశ్, ముళ్ళూరు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయంలో విశేష పూజలు

చేళూరు: తాలూకా కేంద్రమైన చేళూరులో వ్యాసమహర్షి ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి ఆలయంలో సీతాసమేత కోదండరామస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మారుతి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు పానకం, మజ్జిగ, వడపప్పు పంపిణీ చేశారు. ఆదివారం రాత్రి స్వామివారి ఊరేగింపు మేళతాళాల నడుమ పురవీధులలో కొనసాగింది.

కోనపల్లిలో కోదండరామస్వామి రథోత్సవం

చింతామణి: తాలూకాలోని అంబాజిదుర్గ హోబళి పరిధిలోని కోనపల్లిలో నెలవైన కోదండ రామస్వామి ఆలయ బ్రహ్మరథోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో వేలాదిమంది భక్తుల నడుమ జరిగింది. సోమవారం ఉదయం స్వామివారికి విశేషపూజలు, వివిధ హోమాదికాలు నిర్వహించారు. వందలాదిమంది భక్తులకు గ్రామస్థులు పానకం, మజ్జిగ, పెసరపప్పు పంపిణీ చేసి అన్న సంతర్పణ నిర్వహించారు. గ్రామపెద్దలు శివారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, బెస్కాం అశోక్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సరోజమ్మ, రాజశేఖరరెడ్డి, నాగభూషణరెడ్డి, మను ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మంగళవారం సాయంత్రం ఉట్ల ఉత్సవం జరగనుంది.



ఆంజనేయస్వామికి అలంకరణ



మహదేవపురలో శ్రీరాముడి శోభాయాత్రలో స్వామిజీ తదితరులు



కోనపల్లి పురవీధులలో రథోత్సవం

భూస్వాధీనంలో నీరావరి ప్రాంతాలను కాపాడుతాం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

శిడ్లఘట్ట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేఐఏడీబీ ఆధ్వర్యంలో భూస్వాధీన ప్రక్రియలో నీరావరి ప్రాంతాలను కాపాడేందుకు ప్రామాణికంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే రవికుమార్ భరోసా ఇచ్చారు. జంగమకోటె హోబళిలో కేఐఏడీబీ నుంచి రైతుల భూస్వాధీన ప్రక్రియ సాగుతోంది. ఈ నేపథ్యంలో రైతుసంఘాలు ఎమ్మెల్యేను గృహకార్యాలయంలో కలసి వినతిపత్రం సమర్పించగా సానుకూలంగా స్పందించారు. ఫలవంతమైన నీరావరి ప్రదేశాన్ని వీడాలని, అదే విధంగా మిగులు భూములకు రైతులకు ఎక్కువ పరిహారం ఇవ్వాలన్న రైతుల డిమాండ్ స్పందించారు. పీఎస్ఎల్ కంపెనీ నుంచి మోసపోయిన రైతులకు భూ పరిహారం ఇవ్వాలని రైతులు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను రైతు బిడ్డనని, అన్నదాతల కష్టం తెలుసునన్నారు. పారిశ్రామికవాడను తేవడం, లేదా ఆపడం తన చేతిలో లేదన్నారు. అయితే రైతులకు అన్యాయం జరగకుండా తానుశక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నడిపినాయకనహళ్ళి, యణ్ణంగూరు గ్రామాలకు చెందిన నీరావరి ప్రదేశాన్ని కాపాడేందుకు ప్రభుత్వ దృష్టికి తెస్తానన్నారు. ఈ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మునికెంపణ్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి భక్తరహళ్ళి ప్రతీశ్, తాలూకా అధ్యక్షులు మునేగౌడ, సమితి సభ్యులు నడిపి నాయకనహళ్ళి సుబ్రమణి, మోహన్ సహా 13 గ్రామాలకు చెందిన రైతులు తదితరులు ఉన్నారు.

వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ నగరంలో నిరసన తెలిపారు. ఫ్రీడంపార్కులో వివిధ ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. రాజ్యాంగాన్ని రక్షించాలని, వక్ఫ్ బిల్లును అమలు చేయరాదని డిమాండ్ చేశారు. వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నిత్యావసరాల ధరల పెంపుపై ...

నిత్యావసర ధరల పెంపును నిరసిస్తూ ఎస్‌యూసీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఫ్రీడంపార్కులో రాష్ట్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాలు, నీరు, విద్యుత్, డీజిల్, బస్సు చార్జీలు, టోల్ చార్జీలు, ఆస్తి పన్ను, చెత్తపన్నులతో ప్రజలపై ఎనలేని భారం మోపారని మండిపడ్డారు. ఫ్రీడంపార్కులో మరో సంఘాల సభ్యులు నిరసన వ్యక్తం చేయడంతో ఈ ప్రాంగణంలోసందడి నెలకొంది.



వక్ఫ్‌బిల్లుపై ప్లకార్డులతో నిరసన



ఎస్‌యూసీఐ ఆధ్వర్యంలో ధర్నా

ఏపీఎంసీ మార్కెట్‌లో ఉపలోకాయుక్త తనిఖీలు



మార్కెట్‌లో రైతుల సమస్యలు ఆలకిస్తున్న ఉపలోకాయుక్త వీరప్ప

దొడ్డబళ్ళాపుర, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్ ఆవరణలో రాగి కొనుగోలు కేంద్రాన్ని ఉపలోకాయుక్త బీ వీరప్ప సోమవారం అకస్మిక తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు తాగునీటి సమస్య, తూకాలలో మోసం, కూర్చోవడానికి ఆసన వ్యవస్థ లేకపోవడం తదితర సమస్యలను గుర్తించారు. కనీసం శౌచాలయం వ్యవస్థ లేకపోవడంపై ఉపవిభాగాధికారి దుర్గాశ్రీ, తహసీల్దార్ విభా రాథోడ్‌లను హెచ్చరించారు. మీరు మహిళలై కనీసం ఆడవారి సమస్యలపై అవగాహన లేకుంటే ఎలాగని, వేతనాలు సకాలంలో ఇవ్వకుంటే ఎలా బతకాలన్నారు. రైతుల ఫిర్యాదులపై మూడు రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బెంగళూరు గ్రామీణ జిల్లా లోకాయుక్త ఎస్పీ పవన్ నజ్యూర్, డీఎస్పీ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

కోచిముల్ అక్రమాలపై మంత్రికి లేఖ

బంగారపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కోచిముల్ (కోలారు - చిక్కబళ్ళాపుర పాల సమాఖ్య)లో కోట్లాది రూపాయల అక్రమాలు జరిగాయంటూ సొంత పార్టీవారే విమర్శలు గుప్పిస్తున్న తరుణంలో కోచిముల్ మాజీ అధ్యక్షుడు, మాలూరు ఎమ్మెల్యే కై నంజేగౌడకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లో శీతలసమరం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కోలారు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బైరతి సురేశ్‌కు బంగారపేట ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి లేఖ రాయడం రాజకీయ చర్చకు కారణమవుతోంది. డీసీసీ బ్యాంకు, పాల సమాఖ్య ఎన్నికల నిర్వహణకు సంబంధించి చర్చించాలని ఫోన్ ద్వారా సూచించిన మేరకు ధన్యవాదాలంటూ లేఖలో పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని విభజించే వేళ మీకు ఆప్తులైన కేవై నంజేగౌడ తమ దర్పంతో ఇష్టం వచ్చినట్టు విభ జించారని, కోచిముల్ డెయిరీలో సుమారు రూ.250కోట్ల దుర్వినియోగం చేశారంటూ లేఖలో ప్రస్తావించినట్టు తెలుస్తోంది. విభజనవేళ కోలారు జిల్లా రైతులకు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అన్యాయం జరిగిందని ప్రస్తావించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి ఎమ్మెల్యే లేఖ రాయడం సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది.

అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరిస్తాం

బెంగళూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలను అనిల్ అగర్వాల్ ఫౌండేషన్ తన నందఘర్ ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి చేస్తామని హిందూస్థాన్ జింక్ లిమిటెడ్ చైర్మన్ ప్రియా అగర్వాల్ హెబ్బార్ ప్రకటించారు. బెంగళూరులో ఆదివారం మీడి యాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నందఘర్ ప్రాజెక్టు ద్వారా 8044 అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేశామని తదుపరి ప్రాజెక్టును కొనసా గించాలని తీర్మానించా మన్నారు. తద్వారా 3లక్షల మంది పిల్లలు, 2లక్షలమంది మహిళలకు పౌష్టికాహారం, వైద్యసేవలు మెరుగు అయ్యాయన్నారు.

ప్రస్తుతం 15 రాష్ట్రాలలో ప్రాజెక్టులను అమలు చేస్తున్నామన్నారు. కేంద్రాలలో మౌలిక సదుపాయాలు, స్మార్ట్ ఎడ్యుకేషన్ విధానాలు ఇంటరాక్టివ్, ఇ-లర్నింగ్ మాడ్యూల్, స్మార్ట్ టీవీలను సమకూర్చా మన్నారు. పిల్లలకు ఫర్నీచర్, విద్యుత్ సౌలభ్యం, తాగునీరు కల్పిస్తున్నామన్నారు. మహిళలకు ఆహార సంస్కరణ, చేతివృత్తులు, రిటైల్ వ్యాపారాలలో శిక్షణలు ఇస్తున్నామని తద్వారా వారు నెలవారీ ఆర్థిక సామర్థ్యం పెంచుకునేందుకు వీలు కల్పిస్తున్నామన్నారు. నందఘర్ ప్రాజెక్టు సీఈఓ శశి అరోరా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో సమగ్ర అభివృద్ధి, మహిళా సాధికారతకు కట్టుబడ్డా మన్నారు. సంస్థ సామాజిక సేవలపై ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి.



చిత్రదుర్గ జిల్లాలో అభివృద్ధి చేసిన అంగన్‌వాడీ కేంద్రం

కాంతి వేగంపై విద్యార్థుల్లో అవగాహన పెరగాలి



డాక్టర్ బీఎస్ శ్రీకంఠ

బెంగళూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాంతి వేగంపై విద్యార్థులలో అవగాహన పెరగాలని ఆ దిశగా బోధనలు ఉండాలని ప్రముఖ విద్యానిపుణుడు డాక్టర్ బీఎస్ శ్రీకంఠ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంతివేగం సెకనుకు 1.86 లక్షల మైళ్ల లేదా 3లక్షల కిలోమీటర్ల వేగంతో ప్రసారం అవుతుందన్నారు. 93 మిలియన్ మైళ్ల లేదా 150 మిలియన్ కిలోమీటర్ల దూరంలోని సూర్యుడికాంతి కేవలం 8 నిమిషాలలో భూమిని చేరుతుందన్నారు. ఒక సెకనులో భూమిని ఏడున్నర ప్రదక్షిణలు వేసేంత వేగంలో ప్రసారం అవుతుందన్నారు. ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంత ప్రకారం ఏ వస్తువు కాంతివేగానికి మించి ప్రసారం కావడం సాధ్యం కాదన్నారు. 1966లో లైట్ ఆఫ్ అదర్‌డేస్ అనే శాస్త్రీయ నవలలో బాద్‌షా పొందుపరిచారన్నారు. కాంతివేగం సెకనుకు 3లక్షల కిలోమీటర్లు కాగా గాజు, నీరు, వజ్రం వంటి పారదర్శకమైన వాటిపై ప్రసారంలో వేగం తగ్గుతుందన్నారు. గాజులో సెకనుకు 2లక్షల కిలోమీటర్లు, నీటిలో 2.25 లక్షల కిలోమీటర్లు, వజ్రంలో 1.25 లక్షల కిలోమీటర్లకు తగ్గుతుందన్నారు. నిదానంగా కాంతి ప్రసారం ద్వారా పలు ఉపయోగాలు ఉన్నాయని, ఆప్టికల్స్‌ను ఉపయోగించవచ్చునన్నారు. రేఖాంశాల ధ్రువవిజ్ఞాన పరిణామాలు పెంచడం సాధ్యమన్నారు. ఈమేరకు ఆయన సోమవారం ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు టీచర్ మునిరత్నమ్మ



మునిరత్నమ్మ

ముళబాగిలు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కోలారులో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలలో ముళబాగిలు పట్టణం అరవపాళ్యలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల టీచర్ కే మునిరత్నమ్మ విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానంలోనూ, 400 మీర్ట పరుగులో ప్రథమస్థానంలోనూ గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉత్తమ క్రీడాకారిణిగా రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై పాఠశాల సహ ఉపాధ్యాయులు, ఎస్‌డీఎంసీ అధ్యక్షులు, సభ్యులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

సంత గేట్ వసూలుపై వాగ్వాదం



దొమ్మసంద్రలోని వారపుసంత

దొమ్మసంద్ర, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దొమ్మసంద్రలో నిర్వహించే వారపుసంతకు గేట్ వసూలు చేసే అంశంపై పీడీఓ మంజునాథరెడ్డి, కాంట్రాక్టర్‌లు అఖిల్‌నంద, నాగేశ్‌లపై వాగ్వాదం చోటు చేసుకుంది. ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామపంచాయతీ పరిధిలో ఏడాది అవధికి కాంట్రాక్టు పొందారు. మార్చి 31తో కాంట్రాక్టు గడువు ముగిసింది. అయితే గడువు ముగిసినా సంతగేట్ వసూలు చేయడం సరికాదని పీడీఓ మంజునాథరెడ్డి కాంట్రాక్టర్లను హెచ్చరించారు. గ్రామపంచాయతీ అధ్యక్షుడు నరేశ్ మాట్లాడుతూ దొమ్మసంద్ర మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా దుకాణాల ఏర్పాటుతో వాహన సంచారానికి అంతరాయం ఏర్పడుతోందని, ప్రతి సోమవారం ఇలాగే పరిస్థితి ఉందని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

పని చేసినా పస్తేనా..?

● ఉపాధి కూలీలకు బిల్లుల పెండింగ్ ● రూ. 21.27 కోట్ల బకాయి



మడకశిర, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చేసిన పనులకు మూడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది వారాలకు పైబడి చేసిన పనులకు బిల్లులు రావాల్సి ఉంది. జిల్లాలో 2.27 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో కూలీలు 3.99 లక్షలదాకా ఉన్నారు. పది వారాలకుపైబడి ఉపాధి పనులు చేసిన కూలీలు 1.02లక్షల మందిదాకా ఉన్నారు. వారికి రూ. 21.27 కోట్లు దాకా బిల్లులు చెల్లించాల్సి ఉంది. కేవలం మడకశిర క్లస్టర్ పరిధిలోని కూలీలకే రూ.6 కోట్ల దాకా బిల్లులు రావాల్సి ఉంది. చేసిన పనులకు సకాలంలో బిల్లు అందక పోవడంతో పస్తులు ఉండే పరిస్థితి నెలకొందని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లక తప్పదని కూలీలు అంటున్నారు. గతంలో వారానికే బిల్లులు బ్యాంకు ఖతాలో జమ అయ్యేవని ప్రస్తుతం బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

వసతులు కల్పించాలి

పనుల చేసే ప్రాంతాల్లో నీడ, నీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించాలని పలువురు కూలీలు కోరుతున్నారు. ఎండలు మండిపోతున్న ప్రస్తుత తరుణంలో నేల గట్టి పడటం వల్ల పనులు ముందుకు సాగడం లేదని పేర్కొంటున్నారు. రోజంతా పనిచేసిన క్యూబిక్ మీటరు మట్టిని తీయలేక పోతున్నామని కూలీలు చెబుతున్నారు. మడకశిర నియోజకవర్గంలో ఎలాంటి ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చాలమంది కూలీలు ఉపాధిహామీ పథకంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో వ్యవసాయ పనులు కూడా అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. దీంతో కూలీలు పనుల కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి. ఉపాధి పథకం ద్వారా జీవనం సాగిద్దామంటే సకాలంలో బిల్లులు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు: జనరల్ మేనేజర్

డిప్యూటి సర్క్యులేషన్ మేనేజర్ 95909 81234

ACO బెంగళూరు సౌత్ 77951 55585

SR బెంగళూరు ఈస్ట్ 88616 94202

SR బెంగళూరు నార్త్‌వెస్ట్ 99009 22004

SR హోసూరు 86818 81386